# డేంజర్ టర్నింగ్స్

● డివైడర్ల మధ్యలో నాటిన చెట్లు
● కానరాని సూచిక బోర్డులు
● తరచూ ప్రమాదాలు
● పట్టించుకోని అధికారులు

**ఆత్మకూరు :** మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన యూటర్న్‌లు ప్రమాదాలకు చిరునామాగా మారుతున్నాయి. ఆత్మకూరు మండల కేంద్రం హైవేకు రెండు వైపులా జనావాసాలు ఉన్నాయి. గ్రామంలోకి రావడానికి యూటర్న్ తీసుకోవాల్సి వస్తోంది. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. హైవే రెండు లైన్ల నుంచి నాలుగు లైన్లకు విస్తరించిన సందర్భంలో మూడు చోట్ల యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. డివైడర్ల మధ్యలో చెట్లు పెరగడంతో వాహనాన్ని టర్న్ చేసే సమయంలో అటు వైపు నుంచి వచ్చే వాహనాలు కనబడడం లేదని, ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త బస్టాండ్, పాతబస్టాండ్ సమీపంలో యూటర్న్‌ల వద్ద సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయలేదని, పాత బస్టాండ్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు రోడ్డు దాటే ఏర్పాటు చేశారని, దీంతో ప్రజలు రోడ్డు దాటే క్రమంలో వాహనాలు కనబడడం లేదని పలువురు భయాందోళన చెందుతున్నారు. హైవే కావడంతో భారీ వాహనాలు అతివేగంగా వస్తున్నాయని ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిసారించి యూటర్న్‌ల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేసి అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలంటున్నారు.


ఆత్మకూరు జాతీయ రహదారిపై ప్రమాదకరంగా యూటర్న్

### సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి



హైవేపై యూటర్న్‌ల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. ఆటోమేటిక్ సిగ్నల్ సిస్టమ్ ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు. హైవే అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలి.

– శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు

### ఇబ్బందులు తొలగించాలి



హైవేపై యూటర్న్‌లను అశాస్త్రీయంగా నిర్మించారు. యూటర్న్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. రోడ్డుపై నడిచేవారికి, దాటే వారికి ప్రమాదకరంగా ఉంది. చర్యలు చేపట్టాలి.

– సంతోశ్‌గౌడ్, స్థానికుడు

## క్లుప్తంగా

### స్నేహితుడి కుటుంబానికి చేయూత



**శాయంపేట :** మండల కేంద్రానికి చెందిన రాయరాకుల కుమారస్వామి తండ్రి రాయరాకుల చేరాలు ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 1990–91 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన కుమారస్వామి స్నేహితులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించారు.

### మస్జీద్ కమిటీ ఎన్నిక



**వేలేరు :** మండలంలోని ఎర్రబెల్లి గ్రామ మస్జీద్–ఏ–యూసుఫ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు మహ్మద్ రియాజ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా ఎండీ.రియాజ్, ఉపాధ్యక్షుడిగా ఫరూక్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శిగా షబ్బీర్ పాషా, కార్యదర్శిగా అబ్దుల్ నవి, కోశాధికారిగా ఆసీఫ్, డైరక్టర్లుగా సమీర్, అజ్గర్ అలీ, మస్జీద్ ఇమామ్‌గా మహ్మద్ షేక్ అలీ, మోజన్‌గా దస్తగీర్‌ని ఎన్నుకున్నట్లు తెలిపారు.

### రోడ్డు పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

**నడికూడ :** మండంలోని నార్లాపూర్–పరకాల రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గత ఏడాదిన్నర నుంచి రోడ్డు విస్తరణ పనులు నిలువగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సాక్షి దినపత్రికలో మే 18న 'నిలిచిన రోడ్డు విస్తరణ పనులు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో మండల కాంగ్రెస్ నాయకులు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభింపజేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

### ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌నకు విద్యార్థిని ఎంపిక



**కమలాపూర్ :** మండలంలోని ఉప్పల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన మహ్మద్ మాహీన్ అనే విద్యార్థిని నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)నకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వి.వాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాహీన్‌కు నెలకు రూ.వెయ్యి చొప్పున నాలుగేళ్ల పాటు రూ.48 వేలు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ అందనుందని తెలిపారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థిని మాహీన్‌ను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

### లైబ్రేరియన్‌ను నియమించాలి



**కమలాపూర్ :** మండల కేంద్రంలోని గ్రంథాలయానికి లైబ్రేరియన్‌ను నియమించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కత్తి రమేశ్‌గౌడ్ కోరారు. ఈ మేరకు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్ ఖాన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ లేకపోగా అక్కడి స్వీపర్ అన్ని పనులు చేయాల్సి వస్తోందన్నారు. గ్రంథాలయంలో అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలని, అవసరమైన కంప్యూటర్లు అందించాలని వినతిలో కోరారు.

### మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి



**హనుమకొండ (దామెర) :** మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని సఖి లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. మండలంలోని ల్యాదళ్ల వీఓ కార్యాలయంలో సోమవారం సఖి సేవలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సఖివన్‌స్టాప్ సెంటర్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, ఐసీడీఎస్ నిర్వహించే సేవలను వివరించారు. శ్రీదేవి మాట్లాడుతూ.. సఖి సెంటర్ 24గంటలు పనిచేస్తోందన్నారు. బాధిత మహిళలు 181 మహిళ హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన


మాట్లాడుతున్న ఆంజనేయులు

● ఎంపీడీఓ ఆంజనేయులు

**పరకాల :** బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అన్నారు. పరకాల మండల కేంద్రంలో సోమవారం బడిబాట ప్రోగ్రాం, ఎంరోల్మెంట్ డ్రైవ్, ఓపెన్ స్కూల్, అడల్ట్ ఎడ్యుకేషన్‌తో పాటు మాదకద్రవ్యాల వ్యసనం వలన కలిగే నష్టాలపై మండల విద్యాశాఖాధికారి రమాదేవి అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులను బలోపేతం చేయడంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, మహిళా సమాఖ్య సభ్యులు కృషి చాలా అవసరమని అన్నారు. ప్రతి గ్రామంలో 100 శాతం అక్షరాస్యత సాధించేలా కృషిచేయాలని కోరారు. బడిబాటలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను జయప్రదం చేయాలని కోరారు. అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్, మహిళ సమాఖ్య సభ్యులు, మెప్మా సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**ఇంటింటి ప్రచారం..**

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన ఉంటుందని మాజీ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కొప్పుల గ్రామంలో సోమవారం పెద్దకోడెపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ప్రచారం చేశారు. అనంతరం నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధిస్తున్నారని అన్నారు. కొప్పుల గ్రామ విద్యార్థులు ఎవరైన 5 తరగతి నుంచి 10 తరగతి వరకు ఉంటే పెద్దకోడెపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలో చేరిన వారికి రవాణా భత్యంగా రూ. 6వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

## పండ్ల మొక్కలు అందించడం అభినందనీయం

**వేలేరు :** గురుకుల పాఠశాలకు పండ్ల మొక్కలు అందించడం అభినందనీయమని తహసీల్దార్ హెచ్.కోమి అన్నారు. గ్రామానికి చెందిన అలహాబాద్ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ కొల్లూరి మధుకర్ రూ.10 వేల విలువచేసే 30 రకాల పండ్ల మొక్కలను స్థానిక గురుకుల పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలుష్య రహిత గ్రామాలను తయారు చేయాలంటే విరివిగా మొక్కలు నాటాలని అన్నారు. మొక్కల పెంపకం వలన వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక అధ్యక్షుడు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ సుధాకర్ స్వామి, డాక్టర్ చేరాలు, గ్రామస్తులు రాజశేఖర్, రాజిరెడ్డి పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న తహసీల్దార్ కోమి

## మానవుడి ఆరోగ్యానికి యోగా అవసరం

యోగా ఇన్‌స్ట్రక్టర్స్ రఘుపతి, అమూల్య

**పరకాల :** పెరుగుతున్న మానసిక ఒత్తిళ్లను ఎదుర్కోవాలంటే ప్రతి మనిషికి యోగా చాలా అవసరమని యునాని ఆసుపత్రి యోగా ఇన్‌స్ట్రక్టర్స్ భోగ రఘుపతి, అమూల్య అన్నారు. ఈనెల 21వ తేదీన యోగా దినోత్సవం సందర్భంగా పరకాల మున్సిపల్ ఆస్పత్రిలో ఆయుష్ విభాగం యోగా ఇన్‌స్ట్రక్టర్స్ భోగ రఘుపతి, అమూల్యతో కలిసి ఆపద మిత్రలకు యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. తినే ఆహారంతో పాటు మనిషి ఆరోగ్యం చాలా ముఖ్యమనే విషయాన్ని గమనించి ప్రతిరోజు గంట సమయం యోగా కోసం కేటాయించాలని సూచించారు. దీంతో అనేక అనారోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈనెల 16న స్థానిక ఎమ్మెల్యేతో కలిసి నిర్వహించనున్న యోగా వాక్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆపద మిత్రలకు యోగాపై అవగాహన కల్పిస్తున్న యోగా ఇన్‌స్ట్రక్టర్స్ రఘుపతి, అమూల్య

### బతుకుదెరువుకు వచ్చి కానరాని లోకాలకు


మృతదేహం వద్ద రోధిస్తున్న కుంటుంబ సభ్యులు

**ధర్మసాగర్ :** బతుకుదెరువుకు వచ్చి రోడ్డు ప్రమాదంలో కానరాని లోకానికి వెళ్లాడు ఓ వలస జీవి. ఈ సంఘటన ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజీపేట మండలం రాంపూర్ శివారు జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కైలాష్ (50) రాంపూర్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. సోమవారం మధ్యాహ్నం కైలాష్ రాంపూర్ శివారు మెయిన్ రోడ్డు దాటుతుండగా కాజీపేటకు చెందిన కోల శ్రీధర్ కారులో కరుణాపురం నుంచి కాజీపేటకు వస్తున్నాడు. ఈ క్రమంలో కారు అతివేగంతో వచ్చి కైలాష్‌ను ఢీ కొట్టింది. అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య శ్యాంబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జానీ పాషా తెలిపారు.

### కేసు నమోదు

**ఆత్మకూరు :** రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు పీఎస్ పరిధిలోని దామెర మండలం దుర్గంపేటకు చెందిన గడ్డం ప్రభాకర్ చెత్తను డంపింగ్‌యార్డులో వేసేందుకు ఈనెల 6న బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో దుర్గంపేట కెనాల్ వద్ద హనుమకొండకు వెళుతున్న కారు అతివేగంగా ఢీ కొనడంతో తీవ్రగాయాలు కాగా ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. కాగా గాయపడిన ప్రభాకర్ కుమారుడు రాకేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు బైక్‌ను ఢీ కొట్టిన అశోక్‌చౌదరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు ఎస్సై తిరుపతి తెలిపారు.

### సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**కాజీపేట :** అవగాహనా లోపంతో కొందరు సైబర్ మోసాలకు గురవుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటి వారికి చెప్పొద్దన్నారు. ఇటీవల సైబర్ మోసగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరలేపి అమాయకులను ఆర్థికంగా దోచుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు, లింకులు, ఓటీపీల వంటి వివరాలు ఎవరికీ తెలుపొద్దన్నారు.

### కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

**శాయంపేట :** మండలంలోని గంగిరేణిగూడెం గ్రామంలో గల పల్లె ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు మాజీ వైస్ ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసి అక్కడ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని నిర్మించాలని కొందరు కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి వలన అధికారులు శంకుస్థాపన పూర్తిచేశారని ఆరోపించారు. పల్లె ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, ముగ్దుమ్‌పాషా, రమేశ్, కుమారస్వామి, పోషాలు తదితరులు పాల్గొన్నారు.

### చర్య తీసుకోవాలి



**వేలేరు :** తమ ఇంటికి వెళ్లే దారిలో అక్రమంగా గోడ నిర్మించిన వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కాశేశ్వరం మహేశ్ కుటుంబ సభ్యులు సంబంధిత అధికారులను కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత యాభై ఏళ్లుగా నివాసముంటున్న ఇంటికి వెళ్లే దారికి అవతలి వైపు ఉన్న ఓ వ్యక్తి ఆ స్థలం తనదేనని ప్రహరీ నిర్మాణం చేపట్టడంతో ఇంటికి వెళ్లేందుకు వీలు లేదన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతూ దాడి చేయడానికి ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఈ విషయమై స్థానిక ఎస్సైకి ఫిర్యాదు చేసేందుకు వెళ్తే ఎస్సై అందుబాటులో లేరని, డ్యూటీలో ఉన్న అధికారులు సివిల్ తగాదాలు పోలీస్ స్టేషన్‌లో చేయమని చెప్పారని అన్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి తమ ఇంటికి వెళ్లే దారిలో కట్టిన గోడను తొలిగించాలని, సంబంధిత వ్యక్తులపై చర్య తీసుకోవాలని కోరారు.

### కొనసాగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సు


శాయంపేట : రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

**శాయంపేట :** మండలంలోని వసంతాపూర్ గ్రామంలో సోమవారం తహసీల్దార్ కల్వల సత్యనారాయణ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతాపూర్‌లో నెలకొన్న భూ సమస్యలపై రైతులు అందించిన దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**పరకాల :** పరకాల మండలం మల్లక్‌పేట గ్రామంలో సోమవారం జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సులో 112 అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దార్ విజయలక్ష్మీ తెలిపారు. రెవెన్యూ సదస్సులో అందించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించనున్నట్లు తెలిపారు.

## ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు


వీరనారాయణపూర్‌లో రేణుకా ఎల్లమ్మ బోనాలతో వెళ్తున్న మహిళలు

**ఎల్కతుర్తి :** మండల కేంద్రంలోని వీరనారాయణపూర్ గ్రామంలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా చివరిరోజు సోమవారం ఘనంగా జరిగాయి. గౌడ సంఘం ఆధ్వర్యంలో మహిళలు పెద్దఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా బయలుదేరారు. అమ్మవారి ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి బోనాలు, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

## త్వరలోనే డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ

● ఏఎంసీ చైర్ పర్సన్ ఝాన్సీరాణి

**కమలాపూర్ :** అర్హులైన పేదలకు త్వరలోనే డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తొటం ఝాన్సీరాణి తెలిపారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లను ఎంపీడీఓ గుండె బాబుతో కలిసి సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండల కేంద్రంలో 350, మర్రిపల్లి గూడెంలో 50, గూడూరులో 50 చొప్పున డబుల్ బెడ్రూం ఇళ్లను గత ఎనిమిదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ప్రారంభించి వాటిని పూర్తిచేయకుండా అసంపూర్తిగా వదిలేసిందన్నారు. అందులో 30 డబుల్ బెడ్రూం ఇళ్లు జర్నలిస్టులకు కేటాయించినట్లు తెలిపారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ స్పందించి ఇళ్లు, ఇంటి స్థలం లేని నిరుపేదలకు త్వరితగతిన డబుల్ బెడ్రూం ఇళ్లు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో మాట్లాడి డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న శానిటరీ, ఎలక్ట్రిసిటీ, వాటర్ సప్లై తదితర పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పెండింగ్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అంతకుముందు మండలంలోని కన్నూరుకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు ఆమె ముగ్గు పోసి భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య, మండల కాంగ్రెస్ వాణిజ్య సెల్ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు చరణ్‌పటేల్, శ్రీనివాసరావు, సురేశ్, మొగిలయ్య, నర్సింగం, అశోక్‌రెడ్డి, రాజిరెడ్డి, అనిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఝాన్సీరాణి, ఎంపీడీఓ బాబు

## నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి

● బీఆర్ఎస్ నాయకుడు సుధాకర్

**ఎల్కతుర్తి :** నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం ప్రవేశపెట్టి ఇప్పటి వరకు అమలు చేయకుండా నిరుద్యోగులకు మొండి చేయి చూపిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కండె సుధాకర్ విమర్శించారు. సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకంలో యాభై వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణాలు అందజేస్తామని ప్రకటించడంతో సుమారు రెండు లక్షల నుంచి 4లక్షల నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రుణపత్రాలు అందజేస్తామని చెప్పి చివరి నిమిషంలో వాయిదా వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ పథకం అమలులో ఉందో.. లేదోనని యువత అయోమయానికి గురౌతున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇచ్చిన మాట ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

**ధర్మసాగర్ :** మండల వ్యాప్తంగా ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జాబితాలో పేర్లు నమోదు చేయకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తల పేర్లు నమోదు చేసినట్లు ఆరోపించారు. ఇప్పటికై నా ప్రభుత్వం, అధికారులు ఇళ్లు లేని అర్హత కలిగిన నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు సాయం సందీప్, బచ్చు శివప్రసాద్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్యామ్, సాంబరాజు, సురేశ్, రాములుతో పాటు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందచేస్తున్న బీజేపీ శ్రేణులు

## పంట మార్పిడితో అధిక దిగుబడులు

● కేవీకే శాస్త్రవేత్తలు

**వేలేరు :** రైతులు పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఇండోరియా, డాక్టర్ సాయికిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో వారు పాల్గొని రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. రైతులు ఒకే పంటకు బదులుగా వివిధ రకాల పంటలను సాగు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. వరి, మొక్కజొన్న, పత్తితో పాటు వివిధ రకాల నూనె గింజలు, పప్పు దినుసులను సాగుచేయాలని సూచించారు. అనంతరం ఏఓ కవిత మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయంలో నూతన సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. జీవన ఎరువులను విరివిగా వాడాలన్నారు. అనంతరం రైతులు అడిగిన సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు. ఎఈఓలు రాజశేఖర్, శిల్పా, సాయిచంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త ఇందొరియా

## రైల్వేకోచ్ ఫ్యాక్టరీ కార్మికులకు కౌన్సెలింగ్

**మడికొండ :** స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న 300 మంది కార్మికులకు సీఐ కిషన్ సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్టేషన్ పరిధిలో నేరాలను అదుపు చేయడం కోసం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా కార్మికులు గంజాయి, ఇతర మత్తు పదార్థాల అలవాటు ఉన్నట్లయితే మానుకోవాలని సూచించారు. వారిపై సొంత రాష్ట్రంలో ఏదైనా కేసులు నమోదైతే అలాంటి వివరాలను తెలపాలని కోరారు. మత్తు పదర్థాలు సేవిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, పోలీసు సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.


కోచ్ ఫ్యాక్టరీ కార్మికులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్

## పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

● మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి

**పరకాల :** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగారం గ్రామంలో మాజీ సర్పంచ్ విజయతో కలిసి ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేద కుటుంబాలకు దశలవారీగా ఇళ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఇళ్లు రాని పేదలు ఆందోళన చెందొద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ న్యాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ దాసరి భిక్షపతి, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విజయ

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (S.R) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్‌కుమార్ యాదవ్ (S.R) : 9966290903 (హన్మకొండ)
ఎం. మధు (S.R) : 8639566261 (పరకాల)
ఎస్. నవీన్ (S.R) : 8919855163 (ఎల్కతుర్తి)